క్లుప్తంగా

బియ్యం గింజపై రామమందిర చిత్రం


బియ్యపు గింజపై రామమందిరం చిత్రించిన దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణానికి చెందిన సూక్ష్మ కళాకారుడు బారికి చంద్రశేఖర్ ఆయోధ్య రామమందిరం చిత్రాన్ని బియ్యం గింజపై చిత్రీకరించి అబ్బురపరిచాడు. ఈ నెల 22న అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మంగళవారం బియ్యం గింజపై రామమందిర చిత్రాన్ని చిత్రించడంతో స్థానికులు అభినందించారు.

వైభవంగా రంగనాథుడి ఊరేగింపు


పల్లకీలో ఊరేగుతున్న రంగనాథ స్వామి

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన రంగనాథస్వామి వారికి సోమవారంతో ధనుర్మాస పూజలు ముగిసినట్లు ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత నెల రోజులుగా శ్రీరంగనాథుడికి నిర్వహిస్తున్న ధనుర్మాస పూజల సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, అష్టోత్తర నామార్చన, కుంకుమార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను పల్లకీలో కొలువుంచి మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సహాయం అందిస్తున్న స్నేహితులు

వెల్దుర్తి(కృష్ణగిరి): తమ చిన్ననాటి మిత్రుడి అకాల మరణంతో చలించిన స్నేహితులు అతని కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి స్నేహబంధం చాటుకున్నారు. మండల పరిధిలోని మల్లెపల్లె గ్రామానికి చెందిన పి.పెద్దరాజు గుండె సంబంధిత వ్యాధితో నాలుగురోజుల క్రితం మరణించాడు. అతనితో పాటు వెల్దుర్తి జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి వరకు చదువుకున్న 1994–95 బ్యాచ్ పూర్వ విద్యార్థులు మిత్రుడి మరణవార్త తెలుసుకుని అతని కుటుంబానికి అండగా నిలిచేందుకు సంకల్పించారు. చేయిచేయి కలిపి రూ.35 వేలు సేకరించి సోమవారం మృతుడి ఇంటికి వెళ్లి అతని భార్యకు నగదు అందించారు. మానవత్వం చాటుకున్న స్నేహితులను పలువురు అభినందించారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


క్రీడాకారిణి కేసీ సౌమ్య

ఎమ్మిగనూరుటౌన్: జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో బుధవారం నుంచి ఈ నెల 21 తేదీ వరకు జరగనున్న అండర్–14 జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎమ్మిగనూరు ఎంఎస్ బాలికల జెడ్పీ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని కేసీ సౌమ్య ఎంపికైంది. ఇటీవల విశాఖపట్టణంలో జరిగిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో అత్యంత ప్రతిభ చాటిన విద్యార్థిని జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం కృష్ణమూర్తి మంగళవారం తెలిపారు. విద్యార్థినితో పాటు కోచింగ్ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్లు సుజనకుమారి, నాగేశ్వరిలను హెచ్‌ఎంతో పాటు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

కబడ్డీ విజేత గోనెగండ్ల


గోనెగండ్ల జట్టుకు రూ.20,116 నగదు బహుమతి అందిస్తున్న లక్ష్మీనారాయణ

ఆస్పరి: సంక్రాంతి పండుగ సందర్భంగా ఆస్పరిలో యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు పోటాపోటీగా జరిగాయి. పోటీల్లో 20 జట్లు పాల్గొన్నాయి. మంగళవారం జరిగిన పోటీల్లో విజేతగా గోనెగండ్ల జట్టు నిలిచింది. ఈ జట్టుకు మొదటి బహుమతిగా రూ.20,116లను వైఎస్సార్‌సీపీ నాయకుడు లక్ష్మీనారాయణ, రెండవ బహుమతి తండరడోణ జట్టుకు రూ. 10,116, మూడవ బహుమతి శంకరబండ జట్టుకు రూ. 5,116లను నిర్వాహకులు రామక్రిష్ణ, రంగనాథ్ అందజేశారు. నిర్వాహకులు ఆరవింద్, విజయ్‌కుమార్, మహేష్, నరసింహ, హేమంత్, రాజు, బాలముని, నరసప్ప పాల్గొన్నారు.

కొత్తపల్లికి రాచబాట


నేడు - దూదేకొండ - కొత్తపల్లి గ్రామాల మధ్య మెరిసిపోతున్న తారు రోడ్డు


నేడు - వంక వద్ద నిర్మించిన కల్వర్టు

- గ్రామస్తులకు తీరిన రహదారి కష్టాలు
- గత టీడీపీ హయాంలో రోడ్డు సమస్యను పట్టించుకోని పాలకులు
- గ్రామస్తుల కష్టాలు తీర్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి కృతజ్ఞతలు చెబుతున్న గ్రామస్తులు

పత్తికొండ రూరల్: ఆ గ్రామస్తుల ఏళ్ల నాటి కల నెరవేరింది. గ్రామానికి దారిద్ర్యం తొలగి అద్దంలా మెరిసే రహదారి అందుబాటులోకి రావడంతో వారి కల సాకారమైంది. దీంతో ఆయా గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పత్తికొండ మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి వెళ్లేందుకు రహదారి లేక గ్రామస్తులు ఇబ్బందులు పడేవారు. చిన్నపాటి వర్షం వచ్చినా ఊరు దాటి వచ్చేందుకు వీలులేక అత్యవసర సమయాల్లో నరకయాతన అనుభవించారు. ఎన్నో ఏళ్లుగా తమ గ్రామానికి రహదారి నిర్మించాలని పాలకులను విన్నవించినా వారి సమస్యను ఎవరూ పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టడంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆ గ్రామానికి రోడ్డు నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రభుత్వం దూదేకొండ - కొత్తపల్లి మార్గంలో 5 కి.మీ పొడవున రూ.6.05 కోట్లతో రోడ్డు నిర్మాణం చేపట్టింది. పనులు పూర్తికావడంతో రయ్యిమని దూసుకెళ్లేలా రహదారి, వంక వద్ద బ్రిడ్జి నిర్మాణంతో రహదారి అద్దంలా మెరిసిపోతోంది. గ్రామస్తుల రాకపోకలకు మార్గం సుగమమైంది.

చెప్పారంటే.. చేస్తారంతే :

ఎన్నికల ప్రచారంలో భాగంగా అప్పట్లో గ్రామానికి


నాడు - కొత్తపల్లి గ్రామానికి వెళ్లే దారి

వెళ్లిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంగాటి శ్రీదేవికి గ్రామస్తులు దారిలేక తాము పడుతున్న కష్టాలను చెప్పుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్డు నిర్మాణం చేపడతామని ఆమె హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన వెంటనే ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు అధికారుల ద్వారా ప్రభుత్వానికి నివేదికలు పంపించేలా కృషి చేశారు. సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్న దృష్టికి తీసుకెళ్లి రోడ్డు నిర్మాణానికి నిధులు రూ.6.50 కోట్లు మంజూరు చేయించారు. పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నాణ్యతతో చేపట్టేలా చర్యలు తీసుకుని సకాలంలో పూర్తి చేయించారు.

గ్రామానికి కొత్త కళ



గత కొన్నేళ్లుగా ఎవరూ మా గ్రామ సమస్యను పట్టించుకోలేదు. పొలానికి వెళ్లినప్పుడు వర్షం వస్తే తిరిగి ఇంటికి చేరుకోలేని పరిస్థితి ఉండేది. ఎక్కడికైనా దూరప్రాంతాలకు వెళ్లి తిరిగి వచ్చే సమయంలోనూ మాకు దారి భయం వెంటాడేది. ఊరికి దారిలేక యువకులకు పిల్లనిచ్చేవారు కూడా కాదు. నాడు విద్యార్థులు చదువుకునేందుకు పక్క గ్రామానికి వెళ్లేందుకు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. రహదారి నిర్మాణంతో మా ఊరికి కొత్త కళ వచ్చింది. రోడ్డు నిర్మాణానికి కృషి చేసిన ఎమ్మెల్యే శ్రీదేవమ్మకు రుణపడి ఉంటాం.

– గౌరవ రామాంజినేయులు, కొత్తపల్లి

సమస్యకు పరిష్కారం చూపారు



ఎన్నో ఏళ్లుగా గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యకు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పరిష్కారం చూపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యత ఇస్తోంది. రహదారి నిర్మాణంతో గ్రామస్తుల చిరకాల వాంఛ నెరవేరింది. దారి కష్టాలు తీరడంతో రెండు గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బంది తొలగిపోయింది. కర్నూలు ప్రధాన రహదారికి లింకు రోడ్డు కావడంతో దూర ప్రాంతాలు ఎక్కడికి వెళ్లినా, తిరిగి ఎప్పుడు వచ్చినా గమ్యం చేరుకోవడం ఇప్పుడు సులభతరంగా మారింది.

– ముజుబుర్ రహిమాన్, దూదేకొండ సర్పంచ్

విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించండి

ఆలూరు రూరల్: విద్యుత్ వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించాలని ఏఈ లోకేష్ సూచించారు. ఆయన మంగళవారం స్థానిక విద్యుత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ సరఫరాలో సమస్యలు ఉంటే మీ పరిధిలోని లైన్‌మ్యాన్ దృష్టికి తీసుకోరావాలన్నారు. మీటర్లు, లో ఓల్టేజీ సమస్యలు ఉంటే ఏఈ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలన్నారు. మీటర్ రీడింగ్ వేగంగా తిరగడం బిల్లు ఎక్కువ రావడం వంటి ఇబ్బంది ఉంటే నేరుగా తనను సంప్రదించి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. అలాగే పెండింగ్ బకాయిలపై దృష్టి సారించి వసూలు చేయాలని సిబ్బందికి తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి షష్టి పూజలు

మద్దికెర: స్థానిక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో షష్టి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను పూలతో అలంకరించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణాహుతి, విశేష పూజలు, హోమాలు, మహా మంగళహారతి పూజల అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బదిలీ ఎస్‌ఐకు సన్మానం

హొళగుంద: స్థానిక ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తూ ఇటీవల బదిలీ అయిన వల్లెపు శ్రీనివాసులును మంగళవారం రాత్రి ఘనంగా సన్మానించారు. పోలీసులు, స్థానిక ప్రజాప్రతినిధులు శాలువా కప్పి, పూలమాలలు వేసి సత్కరించారు. ఎస్‌ఐ సేవలను కొనియాడుతూ ఆయన మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఏఎస్‌ఐ శ్రీనివాసులు, కానిస్టేబుళ్లు తదితరులు ఉన్నారు.

పేదల సంక్షేమమే జగనన్న లక్ష్యం


కార్యకర్తలతో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విరుపాక్షి

హాలహర్వి: పేదల సంక్షేమమే సీఎం వైఎస్ జగనన్న లక్ష్యమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బుసినే విరుపాక్షి అన్నారు. మంగళవారం హాలహర్వికి వచ్చిన ఆయనకు స్థానిక నాయకులు రామిరెడ్డి గోపాల్, సుంకన్న, అర్జున, కృష్ణ బాణసంచా కాలుస్తూ స్వాగతం పలికారు. శాలువా వేసి పూలమాలలతో సన్మానించారు. సమన్వకర్తగా ఆయన నియామకంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవినీతికి ఆస్కారం లేకుండా అక్కాచెల్లెమ్మలకు సంక్షేమ పథకాలను నేరుగా అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. సామాన్య కార్యకర్తగా ఉన్న తనను నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించడంపై కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కార్యకర్తలతో కలిసి వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. పచ్చారపల్లి రామిరెడ్డి, నిట్రవట్టి తిమ్మప్ప, అర్జున్, గోపాల్, కృష్ణ, పరశురాం, వంశీ, వన్నూర్, గోవర్ధన్, వన్నూరప్ప తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్మృతివనం ఏర్పాటు చరిత్రాత్మకం

చిప్పగిరి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం ఏర్పాటు చేయడం చరిత్రాత్మకమని విరుపాక్షి అన్నారు. ఆయన మంగళవారం చిప్పగిరిలో మాట్లాడుతూ విజయవాడలోని స్వరాజ్ మైదానంలో 20 ఎకరాల విస్తీర్ణంలో రూ.400 కోట్లతో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ నెల 19న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా అంబేడ్కర్ విగ్రహం, స్మృతివనం ప్రారంభించనున్నట్లు చెప్పారు. కులమతాలకు, ప్రాంతాలకు అతీతంగా ప్రజలు తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

కళాకారులకు సన్మానం

ఆలూరు: వివిధ కళలను ప్రదర్శిస్తూ నిత్యం ప్రజలను మెప్పిస్తున్న కళాకారులకు తగిన ప్రోత్సాహం అందించాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్‌యాదవ్ అన్నారు. అనంతపురం జిల్లా గుంతకల్లు పట్టణకేంద్రంలో రాష్ట్ర పెన్షనర్స్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆలూరు నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన వృద్ధకళాకారులు ఈశ్వరప్ప, గంగరాజ్, ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ నాగరాజ్ తదితరులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి హరిప్రసపాద్ మాట్లాడుతూ కళాకారుల ప్రతిభ, సమాజానికి వారి సేవలను వివరించారు. కళాకారులకు ప్రభుత్వం చేయూతనందించి ఆదుకోవాలని కోరారు.

జయప్రదం చేయండి

హొళగుంద: విజయవాడ నడిబొడ్డున ఈ నెల 19న జరిగే 125 అడుగుల ఎత్తైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ, స్మృతివనం ప్రారంభోత్సవ కార్యక్రమానికి తరలిరావాలని మాలమహానాడు సంఘం జిల్లా అధ్యక్షుడు మహానంది కోరారు. మంగళవారం ఆయన సంఘం నాయకులతో హొళగుందలో విలేకరులతో మాట్లాడారు. అంబేడ్కర్ మహా విగ్రహాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి మాల మహానాడు సంఘం జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ఉంటుందని, మాల మహానాడు కార్యకర్తలు, అంబేడ్కర్ వాదులు, అభిమానులు, దళితులు, బహుజనులు తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా సహాయ కార్యదర్శి పెద్యాట వీరభద్ర నాయకులు మల్లేశ్, పంపన్న, ఉపేంద్ర, చిదానంద, మల్లి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తరలి రండి

ఈ నెల 19న విజయవాడ జరిగే అంబేడ్కర్ విగ్రహ ప్రారంభోత్సవానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, అన్ని వర్గాల ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.

హోరాహోరీగా గిరకబండి పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న వీరశైవ లింగాయతీ కార్పొరేషన్ చైర్మన్ వై.రుద్రగౌడ్

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గుడేకల్ గ్రామంలో సంక్రాంతి పండగ పురస్కరించుకొని గ్రామ పెద్దలు వీరశైవ లింగాయతీ కార్పొరేషన్ చైర్మన్ వై.రుద్రగౌడ్, సింగిల్ విండో అధ్యక్షుడు వై.పురుషోత్తంగౌడ్, వై.కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం వృషభాల గిరకబండి పోటీలు నిర్వహించారు. పోటీలను రుద్రగౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగ అంటేనే రైతులు, ఎద్దుల పండగ అన్నారు. పండించిన ధాన్యం ఇంటికి వచ్చిన తరువాత రైతులు జరుపుకొనే తొలి పండుగ సంక్రాంతి అన్నారు. గిరకబండి పోటీలకు ఏపీ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి 29 మంది పోటీదారులు వచ్చినట్లు తెలిపారు.

గిరక పోటీల్లో గెలుపొందిన వృషభాలు

- నందవరం మండలం హాలహర్వికి చెందిన ఈరన్న ఎద్దులు నిర్ణీత సమయంలో గిరకబండిని 3089.8 అడుగుల దూరం లాగి విజేతగా నిలిచారు. ఆ వృషభాల యజమానులు మొదటి బహుమతి రూ.30 వేలు అందుకున్నారు.
- పత్తికొండ మండలం పులికొండ రంగన్న నాయుడు ఎద్దులు 2852 అడుగుల దూరం లాగి రూ.25 వేలు గెలుపొందాయి.
- ఆస్పరి మండలం వలగొండకు చెందిన ఈరన్న ఎద్దులు 2726 అడుగుల దూరం లాగి రూ.20 వేలు గెలుపొందాయి.
- దేవనకొండ మండలం ప్యాలకుర్తికి చెందిన అల్లాబకాష్ ఎద్దులు 2700 అడుగుల దూరం లాగి రూ.15 వేలు దక్కించుకున్నాయి.
- వరుణ్‌ప్రసాద్ ఎద్దులు 2688 అడుగుల దూరం లాగి రూ. 10 వేలు దక్కించుకున్నాయి.
- ఇందువాసికి చెందిన పోగుల తిమ్మప్ప ఎద్దులు 2654 అడుగుల దూరం లాగి రూ.8 వేలు, హరి కృష్ణ ఎద్దులు 2600 అడుగులు దూరం లాగి రూ. 5 వేలను గెలుచుకున్నాయి.

పోటీలను సర్పంచ్ మాల నరసమ్మ, ఎంపీటీసీలు అయప్ప, రాజు, పొలయ్య, ఆర్గనైజర్లు నల్లయ్య, వీరేంద్రగౌడ్, మంగయ్య, రామయ్య, చాకలి నల్లయ్య గ్రామ పెద్దలు పర్యవేక్షించారు.

నేడు తలనీలాల వేలంపాట

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన రంగనాథ స్వామి ఆలయంలో ఈ నెల 17వ తేదీన ఉదయం 11 గంటలకు తలనీలాలు పోగు చేసుకునే హక్కుల వేలంపాట నిర్వహించనున్నట్లు ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 2వ తేదీ నుంచి, 2025 ఫిబ్రవరి 5వ తేదీ వరకు ఏడాది పాటు తలనీలాలు పోగుచేసుకునే హక్కులను వేలంపాట ద్వారా కేటాయిస్తామని, ఆసక్తి గలవారు రూ.లక్ష ధరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొనాలన్నారు.

మార్కెట్ ధరకే కందుల కొనుగోలు

చిప్పగిరి: రైతులు పండించిన కందులను మార్కెట్ ధరకే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఏఓ విజయ లక్ష్మి తెలిపారు. ఆమె మంగళవారం మాట్లాడుతూ నాఫెడ్ ద్వారా ప్రభుత్వం కందులను కొనుగోలు చేయడం జరుగుతుందని, కందులు విక్రయించాలనుకునే రైతులు సమీప ఆర్బీకేలకు వెళ్లి పేర్లు నమోదు చేసుకోవాలని, పట్టాదార్ పాసు పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలను సమర్పించాలని సూచించారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం


మారెల్లలో విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న దృశ్యం

తుగ్గలి: సంక్రాంతి పండుగ సందర్భంగా మారెల్లలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో గెలుపొందిన క్రీడా జట్లకు మంగళవారం నగదు బహుమతులు అందజేశారు. విన్నర్స్‌గా ఎద్దులదొడ్డి జట్టు, రన్నర్స్‌గా మారెల్ల జట్టు నిలిచాయి. విన్నర్స్ జట్టుకు బీసీవై నాయకులు జొన్నగిరి మిద్దె వెంకటేష్ రూ.50 వేలు, రన్నర్స్ జట్టుకు పెండేకల్లు ఆర్‌ఎస్ శివసాయి డాబా నరేష్‌గౌడ్ రూ.30 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన మద్దికెర జట్టుకు ఆంజనేయ డాబా వెంకటేష్‌గౌడ్ రూ.20 వేలు నగదు బహుమతులు అందజేశారు. బీసీవై నాయకులు కౌలుట్లయాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు సుధాకరరెడ్డి, లింగన్న, మునెప్ప, మద్దిలేటి, టీడీపీ నాయకులు వెంకటరాముడు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే మైనార్టీలకు ప్రాధాన్యత


వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాజావలిని సన్మానిస్తున్న ముస్లిం పెద్దలు

మద్దికెర: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మైనార్టీల సంక్షేమం కోసం పలు పథకాలు అమలుచేస్తున్నారని మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాజావలి అన్నారు. మంగళవారం స్థానిక ముస్లిం నాయకులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ మైనార్టీలకు రాజకీయంగా ప్రాధాన్యత కల్పించి నలుగురిని ఎమ్మెల్యేలను చేయడం జరిగిందన్నారు. అలాగే ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చి తగిన గౌరవం కల్పించారన్నారు. ముస్లింలలో పేదలందరికీ రిజర్వేషన్ అమలు చేసి ఉన్నతంగా ఎదిగిందేకు తన వంతు కృషి చేశారన్నారు. గతంలో ఏ ప్రభుత్వంలోనూ మైనార్టీలకు ప్రాధాన్యత కల్పించలేదన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా, ముస్లిం మండల వైస్ ప్రెసిడెంట్ అబ్దుల్ ఖలీల్, మహమ్మద్ రఫీ, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు


చిప్పగిరిలో బహుమతులు అందజేస్తున్న విరుపాక్షి


కైరుప్పలలో ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య


చిప్పగిరిలో ముగ్గుల పోటీ నిర్వహిస్తున్న దృశ్యం


గోనెగండ్లలో బహుమతులు అందజేస్తున్న పూజారులు

గోనెగండ్ల: మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు ఆనందోత్సాహాల మధ్య సోమ, మంగళవారాల్లో సంక్రాంతి, కనుమ పండుగలను ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజామునే మహిళలు ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులను వేసి గొబ్బెమ్మలతో అందంగా అలంకరించారు. ఇళ్లలో పిండి వంటలు చేసుకొని ఆయా దేవాలయాల్లో స్వామి వార్లకు నైవేద్యం పెట్టారు. స్థానిక చింతలాముని నల్లారెడ్డి స్వాముల వారి దేవాలయంలో పూజారుల ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అలాగే హెచ్.కైరవాడిలో వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, అలాగే యువత ఆధ్వర్యంలో బైక్ రేస్ తదితర పోటీలు నిర్వహించారు. అనంతరం హెచ్ కైరవాడి గ్రామంలో ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎస్‌ఐ తిమ్మారెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి బహుమతులను అందజేశారు.

కృష్ణగిరి: నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సంక్రాంతి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. రైతులు తమ ఎద్దులను అలంకరించి పారువేట కార్యక్రమాలు చేపట్టారు. పండుగ సందర్భంగా గ్రామాలు బంధుమిత్రులతో కళకళలాడాయి. చాలా గ్రామాల్లో ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులు, గాలిపటాలను ఎగురవేసి సంబరాలు చేసుకున్నారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండల పరిధిలోని పుల్లగుమ్మి గ్రామంలో గరుడ వాహనంపై సీతారామలక్ష్మణుల గ్రామోత్సవం కనుల పండువగా సాగింది. ఆలయ ధర్మకర్త నాగార్జునరెడ్డి, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరెడ్డి, అచ్యుతానందరెడ్డి, గ్రామస్తులు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామంలో ఊరేగించారు. కలుగొట్ల గ్రామంలో అవధూత రామిరెడ్డి తాత ఆరాధనోత్సవం పూజారి రామిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తాత చిత్రపటానికి గ్రామోత్సవం నిర్వహించారు.

ఆలూరు: సంక్రాంతి పండుగ సందర్భంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలుగా ఎంపిక చేసి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఆలూరులో సాయిబాబా మందిరం, భీమలింగేశ్వర స్వామి, శ్రీరుక్మిణి పాండురంగస్వామి, సుంకులమ్మవ్వ, మర్రితాత మఠం, మొలగవెల్లి, అరికెర, కురువెల్లి, ముద్దనగేరి, కమ్మరచేడు తదితర గ్రామాల్లో యువతులు వేసిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి.

ఆస్పరి: ఆస్పరిలోని జనార్ధనస్వామి, రామతీర్థంలోని రామలింగేశ్వరస్వామి, పంచముఖి గాయిత్రీమాత, కైరుప్పల వీరభద్రస్వామి, తంగరడోణలోని చింతలముని, నల్లారెడ్డి స్వామి ఆలయాలలో గంగ, ఆకుపూజ, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మంగళహారతులు, హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కైరుప్పల గ్రామంలో సోమవారం ఏఐవైఎఫ్ ధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య ప్రోత్సాహక బహుమతులు అందజేశారు


పుల్లగుమ్మిలో సీతారామలక్ష్మణులకు పూజలు

చిప్పగిరి: స్థానిక భోగలింగేశ్వర స్వామి ఆలయ ఆవరణలో వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త బుసినె విరుపాక్షి ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీల, చిన్నారులకు వివిధ క్రీడాపోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు


గాయపడిన రమేశ్

వెల్దుర్తి(కృష్ణగిరి): స్థానిక పాతబస్టాండులో సోమవారం జరిగిన బైక్ ప్రమాదంలో కల్లూరు మండలం ఎర్రకత్వకు చెందిన రమేశ్ గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. సినిమా చూసేందుకు మిత్రులతో కలిసి వెల్దుర్తికి వచ్చిన రమేశ్ మిత్రుడి బైక్ తీసుకుని ఒంటరిగా పాత బస్టాండుకు వచ్చాడు. ఆ సమయంలో కర్నూలు టు డోన్ ఆర్టీసీ బస్సు ప్రయాణికులను ఎక్కించుకుని ముందుకు కదులుతుండగా వెనుక నుంచి అతివేగంగా వచ్చిన రమేశ్ బైక్ హ్యాండిల్ బస్సు ముందులో తగలడంతో అదుపు తప్పి రోడ్డుపై పడిపోయాడు. గాయాల పాలపైన రమేశ్‌ను డ్యూటీ పోలీసులు, స్థానికులు ఆటోలో స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్, కండక్టర్ పోలీసులకు వివరాలందించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. అక్కడ కోలుకుని ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయినట్లు సమాచారం.

ఫిల్టర్‌బెడ్ శుభ్రం

హొళగుంద: స్థానిక పంప్‌హౌస్ వద్ద ఉన్న ఫిల్టర్ బెడ్‌లో గడ్డి, పాచి పేరుకుపోవడంతో పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ మంగళవారం కూలీలతో శుభ్రం చేయించారు. గడ్డి, పాచి, పాత ఇసుకను తొలగించి బ్లీచింగ్ పౌడర్, క్లోరినేషన్ ద్వారా నీరు సులభంగా ఫిల్టర్ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

గాయపడిన యువకుడి మృతి


మృతుడు చంద్రబాబు (ఫైల్)

హాలహర్వి: మండలంలోని బాపురం గ్రామంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన చంద్రబాబు (34) అనే యువకుడు చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. చంద్రబాబు కర్ణాటకలోని కారేకల్ గ్రామంలో బసాయి ఫ్యాక్టరీలో సివిల్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 11వ తేదీన విధులు ముగించుకొని బాపురం గ్రామానికి బైకుపై వస్తుండగా అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో చంద్రబాబు తలకు తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు చికిత్స కోసం బళ్లారి ఓపీడీ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం చంద్రబాబు మృతిచెందాడు. కుటుంబానికి అండగా ఉన్న చంద్రబాబు మృతిచెందడంతో తల్లిదండ్రులు అమరమ్మ, వీరభద్రప్ప కన్నీరుమున్నీరుగా విలపించారు. బాధిత కుటుబసభ్యులను వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేంద్ర, రామిరెడ్డి తదితరులు పరామర్శించారు.